
సాక్షి పల్నాడు

శనివారం ♦ 28 ♦ జూన్ ♦ 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునఃపరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



అమ్మవారికి బోనాలు

పిడుగురాళ్ల: ఆషాఢ మాసం నేపథ్యంలో స్థానిక భవానీనగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవస్థానంలో శుక్రవారం అమ్మ వారికి మహిళా భక్తులు బోనాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్సీ,ఎస్టీల ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు ఈ వేదికను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జిల్లా వ్యవసాయాధికారిగా జగ్గారావు



నరసరావుపేట: జిల్లా వ్యవసాయాధికారిగా ఎం.జగ్గారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమిషనర్ కార్యాలయం నుంచి పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా ఆయన నియమితులయ్యారు. గత మూడేళ్లుగా విధుల్లో ఉన్న ఐ.మురళిని కమిషనర్ కార్యాలయానికి రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రపంచ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వంశీకృష్ణ

జాతీయ పోటీలలో రెండు బంగారు పతకాలు కైవసం



సత్తెనపల్లి: ఈ ఏడాది ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన క్రీడాకారుడు పసుపులేటి వంశీకృష్ణ ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాడు. కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు జరుగుతున్నాయి. రాష్ట్ర జట్టులో ఉన్న పసుపులేటి వంశీకృష్ణ రెండు బంగారు పతకాలు సాధించి, పల్నాడు జిల్లా ప్రతిష్టను మరింత ఇనుమడింప చేశాడు. వంశీకృష్ణ డెడ్‌లిఫ్ట్‌లో 83 కేజీల విభాగంలో 285 కేజీలు ఎత్తి బంగారు పతకం సాధించాడు. మొత్తం 737.5 కిలోలు బరువు ఎత్తి ఓవరాల్‌గా మరో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన వంశీకృష్ణను శుక్రవారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ, కోచ్ పసుపులేటి సురేష్, ప్రెసిడెంట్ జిమ్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, క్రీడాకారులు అభినందించారు.

నేడు పానకాల స్వామి ఆలయంలో దీపాలంకరణ

మంగళగిరి: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం(పానకాల స్వామి)లో శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన టూరిస్టు బస్సు



పెదకాకాని: ప్రయాణికులతో వస్తున్న బస్సు కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం త్రుటిలో తప్పింది. తణుకు నుంచి అరుణాచలం తీర్థయాత్రకు 39 మంది ప్రయాణికులతో టూరిస్టు బస్సు బయలుదేరింది. వారు శుక్రవారం రాత్రి పెదకాకాని శివాలయంలో నిద్ర చేసి ఉదయం బయలుదేరాలని నిర్ణయించుకున్నారు. డ్రైవర్ సర్వీసు రోడ్డులో బస్సును నడుపుతున్నాడు. పెదకాకాని మండలం నంబూరు అరబిక్ స్కూల్ సమీపంలోకి చేరుకునే సరికి బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టు వంతెనపైకి ఎక్కి ఆగింది. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా భయంతో కేకలు వేశారు. పలువురి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

రైతు బేజారులు

నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఏర్పాటుకు నోచుకోని రైతుబజార్లు

- రైతు బజార్లు లేక ఇటు రైతులు, అటు వినియోగదారులకు ఇబ్బందులు
- ఇతర ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లి విక్రయించాల్సిన దుస్థితి
- అధిక ధరలకు వ్యాపారుల వద్ద కూరగాయలు కొంటున్న వినియోగదారులు
- అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుకు రైతులు, ప్రజలు డిమాండ్

చెమట చిందించి సాగు చేసిన రైతుకు పంట విక్రయం పెద్ద సమస్యగా ఉంది. ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసే వారికి అందుబాటులో రైతు బజారులు లేక బేజారవుతున్నారు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిద్దామంటే ఖర్చులే తడిసి మోపడవుతున్నాయి. స్థానికంగా దళారుల దందాకు అన్నదాతలే బలవుతున్నారు. ఇటు తక్కువ ధరకు కూరగాయలు, ఆకుకూరలు వంటివి లభించక వినియోగదారులు నష్టపోతున్నారు. మొత్తానికి ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు.



చిలకలూరిపేట రైతు బజార్‌లో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

సాక్షి, నరసరావుపేట: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తే తగిన గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. వినియోగదారులకు సైతం మధ్యవర్తులు లేకుండా రైతుల నుంచే కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయి. దీని వల్ల ఇరువురికి లాభం ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే రైతు బజార్లు తెరపైకి వచ్చాయి.

ఒకే ఒక్కటి.. అదీ అంతంతే..

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం చిలకలూరిపేటలో మాత్రమే రైతు బజారు అందుబాటులో ఉంది. మిగిలిన చోట్ల కర్షకులు, వినియోగదారులు నష్టపోతున్నారు. జిల్లాలో ముఖ్యంగా నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ నియోజకవర్గాలలో కూరగాయలు, ఆకుకూరలు పెద్ద సంఖ్యలో పండిస్తారు. వీటిని నేరుగా రైతులే విక్రయించాలంటే గుంటూరు, విజయవాడ వంటి నగరాలలో ఉన్న రైతు బజార్లకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రవాణా చార్జీలు తడిసిమోపడవడంతో రైతులు లాభం కళ్ల చూసే అవకాశం లేకుండాపోతోంది. దీన్ని ఆసరాగా తీసుకొని దళారులు చెప్పిందే తుది ధర అవుతోంది.

వినియోగదారులపై భారం...

రైతు బజార్లు లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నట్టే వినియోగదారులు సైతం మోసపోతున్నారు. మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు.

అందుబాటులోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు మేలు

జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలలో రైతు బజార్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయి. ప్రభుత్వం దృష్టి పెడితే వాటి ఏర్పాటు సులువవుతుంది.

- జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పల్నాడు బస్టాండ్ వద్ద అన్నా క్యాంటీన్ పక్కన రైతు బజార్ కోసం కేటాయించిన స్థలం, కొన్ని నిర్మాణాలు ఉన్నాయి. వాటిని వినియోగించుకుని పేట ప్రజలకు రైతు బజారును వెంటనే అందుబాటులోకి తీసుకురావచ్చు.
- వినుకొండ ఎన్నెస్పీ స్థలంలో రైతు బజారు కోసం కొంత స్థలాన్ని గతంలో కేటాయించారు. అందులో ఇకనైనా తగిన ఏర్పాట్లు చేసి రైతు బజారు ఆరంభించాలనేది ప్రజల ఆకాంక్ష.
- సత్తెనపల్లిలో మార్కెట్ యార్డులో రైతు బజారు ఉన్నప్పటికీ ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోంది. పూర్తిస్థాయిలో కార్యకలాపాలు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం, అధికారులు దృష్టి పెడితే తిరిగి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉందని రైతులు, వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
- ఇక పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి వంటి చోట్ల సైతం రైతు బజార్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. కూటమి నేతలు, ప్రభుత్వ అధికారులు ఆ దిశగా ఆలోచన చేస్తే రైతు బజార్ల ఏర్పాటు సులువు కానుంది. రైతులు, వినియోగదారులు కూడా ఇదే అభిప్రాయపడుతున్నారు.

నేరుగా విక్రయించే అవకాశం



నాతో పాటు పలువురు రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించడానికి గురజాల నియోజకవర్గంలో రైతు బజార్ అందుబాటులో లేదు. దీంతో దళారులు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెట్‌లో అధిక ధరలు ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం మా నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కష్టపడి పండించిన మాకు ఏమాత్రం లాభం ఉండటం లేదు. రైతు బజార్లు ఉంటే నేరుగా వినియోగదారులకు విక్రయించే వీలుంటుంది.

– గురువారెడ్డి, గురజాల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ రైతు విభాగ అధ్యక్షుడు

తక్కువ ధరకే కూరగాయలు



రైతు బజార్ల ఏర్పాటు వల్ల వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు లభిస్తాయి. రైతులతో పాటు మాలాంటి ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం రాయితీపై ఉల్లి, టమోటా, నూనెలు, పప్పులు లాంటివి విక్రయించేందుకు రైతు బజార్లు ఎంతో ఉపయోగపడతాయి. పిడుగురాళ్లలో రైతు బజారు ఏర్పాటు ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం అధిక ధరలకు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది.

– ఎం.జ్యోతి, జానపాడు, పిడుగురాళ్ల మండలం

రైతులకు అవకాశం ఇస్తే ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ధరలకే లభించే అవకాశం ఉంది. మరో వైపు ఒక్కోసారి టమోటా, ఉల్లి వంటి నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటినప్పుడు ప్రభుత్వం నేరుగా సబ్సిడీ ధరలకు రైతు బజార్లలో విక్రయిస్తోంది. జిల్లాలో రైతు బజార్లు లేకపోవడంతో స్థానికులకు ఇవి చేరడం లేదు. రైతు బజార్ల వల్ల పలువురికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

వ్యర్థాల గోదాములో భారీ అగ్నిప్రమాదం

- రూ.1.10 కోట్ల మేర ఆస్తి బుగ్గిపాలు
- తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో భారీ నష్టం



గోదాములో ఎగసి పడుతున్న మంటలు

వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ గోదాములో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి పదేళ్లుగా ఇక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అగ్నిప్రమాదాల నివారణకు గోదాములో ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. కనీస అనుమతులు కూడా లేవని సమాచారం. మున్సిపల్, అగ్నిమాపక కేంద్రం అధికారులు మంటలను అదుపు చేసేందుకు కష్టపడాల్సి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనరు సుభాష్ చంద్రబోస్, ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో రూ.1.10 కోట్ల మేరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనరు

సి‘ఫార్సు’ల బది‘లీలలు’

- నేటి నుంచి సెక్రటరీల బదిలీలకు కౌన్సెలింగ్
- నచ్చిన సచివాలయంలో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేల నుంచి సిఫార్సుల లేఖలు
- లెటర్లు ఇప్పిస్తామంటూ కార్పొరేటర్లు నగదు వసూలు
- పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్న సెక్రటరీలు



గుంటూరు నగరంలో సచివాలయం

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 అర్బన్ లోకల్ బాడీస్‌లో పనిచేసే సచివాలయ సెక్రటరీలకు బదిలీల కౌన్సెలింగ్ శనివారం, ఆదివారం గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజుల పాటు జరగనుంది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, రేపల్లే, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, గురజాల మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలు, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు హాజరుకావాలి. ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ ప్రాంతంలో కూడా ఈ నెలఖారు లోపు నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ సిద్ధం చేస్తున్నారు.

వీరికి ప్రాధాన్యత

వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీల్లో దివ్యాంగులకు, విజువల్లీ చాలెంజ్‌డ్ సిబ్బందికి, మెడికల్ గ్రౌండ్స్ కింద క్యాన్సర్, హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడీ, మానసిక వ్యాధుల కలిగిన పిల్లల తల్లిదండ్రులకు, స్పౌజ్ కేటగిరి వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఐదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి రిక్వస్ట్ మీద బదిలీలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. మిగులు సిబ్బందిని ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంత వరకు వారికి కేటాయించిన సచివాలయంలో పరిధిలోనే విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించనున్నారు. అర్బన్ లోకల్ బాడీస్(యూఎల్‌బీ)అయితే సొంత వార్డులో పోస్టింగ్ రాదు. రూరల్ ప్రాంతాల్లో అయితే సొంత మండలంలో పోస్టింగ్ కేటాయించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11082 మంది సెక్రటరీలు

గుంటూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్బన్, రూరల్ కలుపుకుని 1344 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 11082 మంది సెక్రటరీలు పని చేస్తున్నారు. వీరిలో కొంత మంది సెక్రటరీలు డెప్యూటేషన్‌పై వెళ్లిన వారు ఉన్నారు. వీరు కూడా కౌన్సెలింగ్‌కు హాజరై మిగుల ఉద్యోగుల కింద ఉండనున్నారు. వీరైతే డెప్యూటేషన్‌పై పనిచేసే సెక్రటరీలకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

కార్పొరేటర్ల దందా

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సెక్రటరీలు వేరే సచివాలయానికి బదిలీ కావడానికి ఆయా ప్రాంత కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సులు లేఖలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో గల్లా మాధవి, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో బూర్ల రామాంజనేయులు దగ్గర నుంచి తమకు అనుకూలంగా ఉండే సచివాలయ ఉద్యోగులను పోస్టింగ్ ఇప్పించుకునేందుకు లెటర్లు ఇప్పిస్తున్నారు. దీనికిగానూ ఒక్కో సెక్రటరీ నుంచి రూ.20 నుంచి 25 వేలు దాకా కార్పొరేటర్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పారదర్శకంగా జరపాలి



గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి. ఉద్యోగుల సీనియారిటీ/ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ చేపట్టాలి. ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొని ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టును ఖాళీగా చూపించాలి. కౌన్సెలింగ్ సమయంలో ఏ ఒక్క ఖాళీ కూడా బ్లాక్ చేయకుండా చూడాలి. బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం. 5, 6లో విధివిధానాలను కచ్చితంగా పాటించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. ప్రజా ప్రతినిధులు ఇచ్చే సిపార్సు లేఖల వల్ల ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా చూడాలి.

– షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

రాజధాని రైతులపై ‘పూలింగ్’ పిడుగు

- పరిధి విస్తరణ పేరుతో 43వేల ఎకరాల సమీకరణ
- భూముల రేట్లు అధికంగా ఉండటంతో ఇచ్చేందుకు రైతుల విముఖత
- అవసరాల మేరకే తీసుకోవాలంటూ సీఎంని కోరిన అధికార పార్టీ నేతలు
- అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో తమ భూములకు గండికొట్ట వద్దంటున్న రైతులు
- రెండు గ్రామాలు కాలగర్భంలో కలిసిపోతాయని భయపడుతున్న గ్రామస్తులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు / తాడికొండ: రాజధాని పరిసర ప్రాంత అన్నదాతల నెత్తిన మళ్లీ భూ సమీకరణ పిడుగు పడనుంది. రెండు రోజుల కిందట కేబినెట్ భేటీలో మరో 43వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికి అవసరమంటూ సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెదవి విరుస్తున్న రైతులు

ప్రస్తుతం సమీకరించిన 33 వేల ఎకరాల భూమి గడచిన 12 ఏళ్లలో ఎటువంటి అభివృద్ధి చెందలేదని, వారికే న్యాయం జరగనప్పుడు తాము భూములు ఇస్తే ఏం చేస్తారంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. రాజధానిలో గతంలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ఇంత వరకు పూర్తి కాలేదు. మళ్లీ భూసమీకరణ అంటే ఎలా ? అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రభుత్వం సమీకరణ సమయంలో ఇచ్చిన ఒప్పందాలు కూడా ప్రభుత్వం అమలు చేయలేదు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల ప్రక్రియలో భాగంగా అభివృద్ధి చేసిన లే-అవుట్లను అందజేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కాని ఇప్పటి వరకు రిటర్నబుల్ ప్లాట్లు ఎక్కడ ఇచ్చారు.. దానికి రోడ్లు, ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

త్యాగం చేసిన రైతులకు నష్టం

ప్రైవేటు సంస్థలకు భూములు కట్టబెట్టడం మినహా భూములిచ్చి త్యాగం చేసిన రైతులకు గత 12 ఏళ్లల్లో ఒరిగిందేమీ లేదు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో రానున్న నాలుగేళ్లలో సమీకరణ ప్రక్రియ పూర్తి కాదని, ఒకవేళ భూములిస్తే తరువాత తమ సంగతేంటనేది ఆ ప్రాంత రైతుల నుంచి వస్తున్న ప్రశ్న.

రైతుల్లో పలు సందేహాలు

ఇటీవల తాడికొండ మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో స్థానిక రైతులు పలు సందేహాలు లేవనెత్తారు. ఒక వేళ పూలింగ్‌కు తీసుకుంటే కౌలు రూ. 40 నుంచి రూ.50వేలు ఇవ్వాలని కొంత మంది కోరారు. మరికొంత మంది అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో భూ సమీకరణ జరుగుతున్నప్పుడు చిన్న గ్రామాలు తొలగిస్తే తమ సంగతేంటని ప్రశ్నించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి గ్రామాలు తొలగించమని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ రైతులు నమ్మడం లేదు. తమ గ్రామాలు తొలగించేందుకు కుట్ర జరుగుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూములు ఇవ్వమని కరాఖండిగా చెబుతున్న రైతులు

ముందు 33వేల ఎకరాల్లో అభివృద్ధి చేసి చూపించిన తరువాత తాము పూలింగ్‌కు సహకరిస్తామని, ఇప్పుడికిప్పుడు తమ భూములు వదులుకోబోమని కరాఖండిగా రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తే తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులే వ్యతిరేకించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా వర్గాలకు చెందిన వారి భూములు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న నేపథ్యంలో పూలింగ్ ప్రక్రియకు విఘాతం కలుగుతుందని వారే ప్రస్తావిస్తుండటం గమనార్హం.

రైతుల్లో వ్యతిరేకత

తాడికొండ మండలానికి చెందిన ఓ సీనియర్ టీడీపీ నాయకుడు ఇటీవల పొన్నెకల్లు గ్రామంలో జరిగిన పీ -4 సదస్సుకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అందులో రైల్వే లైనులు, అంతర్గత రహదారుల వరకు భూ సమీకరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని, అన్ని పొలాలు పూలింగ్‌కు ఇవ్వాలంటే సుముఖంగా లేమంటూ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అనుకున్నదే తడవుగా భూ సమీకరణ పేరుతో నిర్ణయం తీసుకుని మంత్రి వర్గ భేటీలో ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు తీసుకున్న నిర్ణయంపై రైతులు బహిరంగంగానే తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రస్తుతం పూలింగ్‌కు తీసుకున్న భూములకు ధరలు తగ్గి, తీవ్రంగా నష్టపోతామంటూ గతంలో పూలింగ్‌కు ఇచ్చిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన తమ పరిస్థితి మారిందని వాపోతున్నారు. తరతరాలుగా ఉన్న పంట భూములను ప్రభుత్వం తీసుకునేందుకు చేస్తున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు చాలని గతంలో ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో తమ పొట్ట గొడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణమిల్లిన భక్తజనం

అమ్మవారి సారె సమర్పణకు తరలివస్తున్న భక్తబృందాలు



సారె సమర్పిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు భక్తజనం ప్రణమిల్లారు. ఆషాఢ మాసోత్సవాలు, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించారు. అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి ఆలయ ఈవో వి. సుబ్బారావు దంపతులు మహా మండపం ఆరో అంతస్తులోని ఉత్సవ మూర్తికి పట్టుచీర, సారెను సమర్పించారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి భక్తులు బృందాలుగా ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. మహా మండపం ఆరో అంతస్తులో పండుగ వాతావరణం నెలకుంది.

కిటకిటలాడిన క్యూలైన్లు

ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. మహా మండపం, లిఫ్టు, మెట్ల మార్గంతోపాటు ఘాట్ రోడ్డులో కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో సర్వ దర్శనం క్యూలైన్‌తో పాటు రూ. 100, రూ. 300 టికెటు క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు. సాయంత్రం ఆరున్నర గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

మౌలిక వసతుల పరిశీలన

ఇంద్రకీలాద్రిపై ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను నోడల్ అధికారి టి.చంద్రకుమార్ పరిశీలించారు. నోడల్ అధికారి వెంట దుర్గగుడి ఈవో శీనా నాయక్, ఆలయ అధికారులు తదితరులు ఉన్నారు.

జిల్లాలో 65.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో కేవలం తొమ్మిది మండలాల్లో 65.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు శుక్రవారం పేర్కొన్నారు. అత్యధికంగా పెదకూరపాడులో 17.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా గురజాల 4.8, దాచేపల్లి 3.4, అచ్చంపేట 6.2, క్రోసూరు 5.4, అమరావతి 16.8, సత్తెనపల్లి 4.6, రాజుపాలెం 2.4, నరసరావుపేట 4.4 మి.మి వర్షం కురిసింది.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామ సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి చెందాడు. రాత్రివేళ హైవేపై వేగంగా వెళ్తున్న సిమెంట్ కంటైనర్ బ్రేక్ వేయడంతో అదే మార్గంలో వెనుక వస్తున్న గూడ్స్ కంటైనర్ ఢీకొట్టింది. ఈ రెండు వాహనాలు నకరికల్లు వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గూడ్స్ కంటైనర్ డ్రైవర్ రెండు లారీల మధ్య ఇరుక్కుపోయాడు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ అధికారులు, రొంపిచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జేసీబీతో లారీని తొలగించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలతో ఉన్న గూడ్స్ కంటైనర్ డ్రైవర్‌ను హైవే అంబులెన్స్ వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి చెందాడు. రొంపిచర్ల ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాన నీటితో ధ్యాన బుద్ధుడు విగ్రహానికి ముప్పు

అమరావతి: రాజధానిలో ఐకాన్‌గా గుర్తింపు పొందిన 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహానికి వాన నీటితో ముప్పు పొంచి ఉందని, వెంటనే మరమ్మతులు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన విగ్రహాన్ని సందర్శించారు. విగ్రహానికి రెండు రంధ్రాలు పడ్డాయని, దీనివల్ల వర్షం నీటితో దెబ్బ తింటోందని తెలిపారు. లీకులతో సీలింగ్ కూడా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వినతి పత్రం అందించామని ఆయన వెల్లడించారు.

అమ్మో.. కిలేడీ కిల్లర్స్!

- ఆడతనానికి మాయని మచ్చ !
- ఆభరణాల కోసం హత్యలు చేస్తున్న మహిళలు
- నాడు సైనేడ్‌తో నలుగురి హత్య
- నేడు దాడిచేసి ముగ్గురి హత్య
- అన్నీ పట్టపగలు.. బెరుకులేని దారుణాలు
- పోలీసుల అప్రమత్తతతో జైలుపాలు



సుకుమారానికి ప్రతీక అయిన మహిళలే ఇప్పుడు క్రూర నేరాలకు పాల్పడుతున్న తీరు సమాజాన్ని కలవరపెడుతోంది. సైనేడ్‌ను వినియోగించి నలుగురిని హతమార్చిన కేసులో గతేడాది ముగ్గురు మహిళలు అరెస్టయిన వైనం జిల్లా ప్రజల్ని ఆశ్చర్య పరిచింది. నిందితుల్లో ఇద్దరు తల్లీకూతుళ్లు ఉండటం ఆడతనానికి మాయని మచ్చ. మళ్లీ ఇప్పుడు ముగ్గురు వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసిన కేసులో కీలక సూత్రధారి, ఏ-1 ముద్దాయి కూడా మహిళే కావడం ఆందోళన కలిగిస్తోంది. బంగారు ఆభరణాలు, డబ్బుల కోసం సాటి మహిళలను, బంధుత్వాలు సైతం మరచి ప్రాణాలను తీయగల స్థితికి మహిళలు చేరడం విష్మయానికి గురిచేస్తోంది. ప్రేమను, క్షమను పంచే మహిళలు స్వార్థానికి, కూరత్వానికి పరాకాష్టగా చట్టం ముందు దోషుల్లా నిలవడం మన విలువలకు, సమాజానికి గట్టి ఎదురుదెబ్బ.

తెనాలి: గతేడాది జూన్‌లో స్థానిక యడ్ల లింగయ్య కాలనీకి చెందిన రజిని, తనకు పరిచయస్తురాలైన నాగూర్‌బీని ఆటోలో ఎక్కించుకుని తెనాలి-నారాకోడూరు రోడ్డులోని వడ్లమూడి వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. మార్గ మధ్యంలో ఆటో డ్రైవర్‌తో రజిని బ్రీజర్ కొనిపించింది. అదే కాలనీవాసి వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి బైకుపై వీరిని వెన్నంటి వచ్చింది. ముగ్గురూ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లారు. అక్కడ బ్రీజర్‌లో సైనేడ్ కలిపి నాగూర్‌బీకి ఇచ్చారు. ఆ వెంటనే ఆమె చనిపోయింది. ఒంటిపై బంగారు ఆభరణాలను దోచుకుని రజిని, వెంకటేశ్వరి తాపీగా ఇంటికి వచ్చారు. నాగూర్‌బీ మృతదేహం వెలుగులోకి రావడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్‌ను గుర్తించి ప్రశ్నించడంతో రజిని గురించి చెప్పాడు. ఆమెను తీసుకొచ్చి విచారించాక మరిన్ని సంచలన విషయాలు బహిర్గతమయ్యాయి. నాగూర్‌బీ హత్యనే కాదు..రజిని, వెంకటేశ్వరితోపాటు ఆమె తల్లి రమణమ్మ కలిసి 2022 నుంచి మరో ముగ్గురిని సైనేడ్‌తో హత్య చేశారని, వీరి అరెస్టు చూపుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.



సైనేడ్ కిల్లర్స్ చేతిలో హత్యకు గురైన మోషే మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న అధికారులు, పోలీసులు (ఫైల్)

అప్పు ఎగ్గొట్టేందుకు హత్య

మార్కాపురానికి చెందిన సుబ్బలక్ష్మిని ఆమె ఆస్తి, డబ్బులు, బంగారు ఆభరణాలు కోసం ఇదే తరహాలో మద్యంలో సైనేడ్ కలిపి ఇచ్చి చంపారు. వెంకటేశ్వరికి సుబ్బలక్ష్మి స్వయాన అత్త అవుతుంది. ఆ తర్వాత 2023లో నాగమ్మ అనే మహిళను థమ్సప్‌లో సైనేడ్ కలిపి హతమార్చారు. ఆమె వద్ద తీసుకున్న రూ.20 వేల అప్పు ఎగ్గొట్టేందుకు చంపేశారు.

భార్యతో చేతులు కలిపి హత్యకు పథకం

తెనాలికి చెందిన పీసు అలియాస్ మోషే తరుచూ భార్యను వేధిస్తున్నాడు. అతన్ని చంపేందుకు భార్యతో చేతులు కలిపి 2024లో మద్యంలో సైనేడ్ కలిపారు. అతను చనిపోయిన తర్వాత వచ్చే పెన్షన్, ఇన్స్యూరెన్స్ డబ్బులు పంచుకునేందుకు ఆమెతో అగ్రిమెంట్ కుదర్చుకున్నారు. ఈ నాలుగు హత్యలే కాకుండా మరో ముగ్గురిపై హత్యాయత్నం చేశారు. చివరిసారి పథకం పారలేదు. అప్పులు ఎగ్గొట్టడం, వారి వద్ద నున్న బంగారు ఆభరణాలు దోచుకోవాలన్న ఉద్దేశంతోనే సైనేడ్ కలిపి హత్యలు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. వీరికి సైనేడ్ విక్రయించిన నేరంపై మరొకరిని అరెస్టు చేశారు.

ఆభరణాల కోసం వియ్యపురాళ్లు హత్య



ఇటీవల దారుణ హత్యకు గురైన రాజేశ్వరి మృతదేహం



కుసుమకుమారి చేతిలో హత్యకు గురైన అంజమ్మ

పట్టణ శివారులో ఈనెల 19న జరిగిన జంట హత్యల కేసులో ప్రైవేటు బీమా కంపెనీ ఏజెంటు కుసుమకుమారిని ఏ-1 ముద్దాయిగా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఒంటరిగా ఉంటున్న వియ్యపురాళ్లు దాసరి రాజేశ్వరి (65), పిట్టా అంజమ్మ (70)ను పట్టపగలు 11.30 గంటల ప్రాంతంలో వారు నివాసముంటున్న ఇంటి కిందిభాగంలోనే హత్యకు గురయ్యారు. వారి ఒంటిపై బంగారు ఆభరణాలు అదృశ్యమయ్యాయి. సీసీ కెమెరా నిందితులను పట్టిచ్చింది. ఈ కేసులో కుసుమకుమారితోపాటు ఇద్దరు యువకులను పోలీసులను అరెస్టు చేశారు. ఇద్దరిలో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకడు మైనర్ కావడం గమనార్హం. మారీసుపేట రెండుగేట్ల మధ్య ఒక ఇంటిలో వీరు ప్రణాళిక రచించుకోవడం, రెక్కీలు నిర్వహించడం, ఆ ప్రకారం నేరాలకు పాల్పడుతూ వచ్చినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది.

వృద్ధురాలి హత్యలో కూడా పాత్ర

జంట హత్యలకు ముందు గత నెలలో కుసుమకుమారి నివాసానికి దగ్గర్లోనే ఓ వృద్ధురాలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. ఆ నేరం కూడా వీరు చేసిందేనని తమ విచారణలో నిందితులు అంగీకరించినట్టు పోలీసులు అరెస్టు చేసినపుడు తెలియజేశారు. కేవలం బంగారు నగలు, డబ్బు కోసం తోటి మహిళలను అంతమొందించిన నేరంలో కుసుమకుమారి నేరస్థురాలిగా రిమాండ్‌కు వెళ్లింది. ఈ నేరాలతో గతేడాది వెలుగుచూసిన సైనేడ్ హత్యలను కూడా ఇప్పుడు చర్చించుకుంటున్నారు. 'అమ్మో...లేడీ కిల్లర్స్.' అనుకుంటున్నారు స్థానికులు

ప్రతిపక్షాన్ని భూస్థాపితం చేస్తాననడం అవివేకం

- జగన్ అంటే చంద్రబాబుకు ఎనలేని కోపం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



పిడుగురాళ్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు నాయుడు జగన్ భూతాన్ని భూస్థాపితం చేస్తాం అనటం అవివేకమని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కాసు మహేష్ రెడ్డి విడుదల చేసిన వీడియోలో మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజా తీర్పుకు మించింది ఏదీ లేదని, జగన్ మోహన్ రెడ్డి అనే భూతాన్ని భూస్థాపితం చేస్తాం అనడం ఆయన రాజకీయ అనుభవానికి పరాకాష్ట అన్నారు. ఇక టీడీపీనే 15 సంవత్సరాల పాటు అధికారంలో ఉంటుందనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. పొత్తులతో తప్పితే చంద్రబాబు నాయుడు ఒంటరిగా పోటీ చేయడం చేతకాదని విమర్శించారు. ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అందించకుండా ప్రజలకు మోసం చేస్తున్నారు. నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి అందించలేదని, ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్నారు.. అదీ ఇవ్వలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ ఇవ్వకుండా మోసం చేస్తున్న చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్రగా ఉన్న ప్రజా నేత జగన్ మోహన్ రెడ్డిని భూస్థాపితం చేస్తాననడం దుర్మార్గమన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులపై విమర్శించడం సాధారణమే కానీ చంద్రబాబుకు ఎందుకో తెలియదు కానీ జగన్ మోహన్ రెడ్డి అంటే ప్రత్యేకమైన కోపం దాని ప్రభావం వల్లే ఇటువంటి మాటలు మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా కాసు మహేష్ రెడ్డి మండిపడ్డారు.

ప్రాణం తీసిన అక్రమ మట్టి తరలింపు!

కరెంటు స్తంభాన్ని ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్



మృతుడు మఠం నాసరయ్య

వినుకొండ: టీడీపీ నేతల అక్రమ మట్టి తరలింపులో ఓ నిండు ప్రాణం బలైంది. వినుకొండ రూరల్ మండలం దొండపాడు సమీపంలో మునిస్వామి కొండ ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా ట్రాక్టర్ పానకాల సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో పానకాలపాలెం గ్రామానికి చెందిన ఎం.నాసరయ్య (48) ట్రాక్టర్ డ్రైవర్ విద్యుత్ స్తంభం విరిగి మీదపడి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాల ద్వారా రూ. కోట్ల విలువ చేసే మట్టిని అక్రమంగా తరలించడం పరిపాటిగా మారింది. ఈవిషయమై ఈనెల 23న 'సాక్షి' పత్రికలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారంటూ కథనాన్ని ప్రచురించినప్పటికీ దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అక్రమ మైనింగ్‌ను ఆపకుండా వదిలేయడం వల్లే ఈప్రమాదంలో డ్రైవర్ మృతికి కారణమైందని పలువురు వాపోతున్నారు. సంఘటనా స్థలంలో ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడడంతో అక్రమంగా మట్టి తరలిస్తున్న మరో పది ట్రాక్టర్లు నిలిచిపోయాయి. గత్యంతరం లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. మృతుడికి భార్య లక్ష్మి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి పొలిమేర వద్ద శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మోదుగుల రమాదేవి (62) సత్తెనపల్లిలో అల్లుడు పంచుమర్తి శ్రీనివాస రావు వద్దకు వచ్చి తిరిగి లక్ష్మీపురం గ్రామం వెళ్లేందుకు అల్లుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా నందిగామ, గుడిపూడి పొలిమేర వద్ద కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం పడిపోయింది. రమాదేవికి, అల్లుడు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. రమాదేవి తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే రమాదేవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త సాంబశివ రావు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమాదేవి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

ఆరేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం

- స్థానికులు గమనించి దేహశుద్ధి
- అనంతరం పోలీసులకు అప్పగింత

చిలకలూరిపేటటౌన్: ఆరేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని గడియారస్తంభం వద్ద వడ్డెరపాలెంలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పనులు చేస్తున్న తాపీ వర్కర్ సంగారెడ్డి శ్రీనివాసరావు అక్కడే నివాసం ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన ఎల్‌కేజీ చదివే ఆరేళ్ల బాలిక ఇంటిముందు కూర్చుని బ్రష్ చేసుకుంటూ కనిపించింది. బాలికకు మోసపు మాటలు చెప్పి నిర్మాణం చేస్తున్న ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి అతనికి దేహశుద్ధి చేసి, అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ పి రమేష్ తెలిపారు.

మాజీ సైనికుల సంక్షేమం కోసం కృషి

జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీల



వినుకొండ: మాజీసైనికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి ఆర్.గుణశీల వెల్లడించారు. శుక్రవారం మాజీసైనికుల సంక్షేమ కార్యాలయంలో మాజీ సైనికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌సర్వీస్ మ్యాన్‌లకు రావాల్సిన సంక్షేమాలు అందించేందుకు చర్యలు చేపడతామని వివరించారు. అనంతరం మాజీ సైనికోద్యోగుల డిపెండెంట్స్‌కు గుర్తింపు కార్డులు అందించారు. వీరనారీలకు సంబంధించిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరయ్య, సెక్రటరీ పాపిరెడ్డి, ట్రెజరర్ రాధాకృష్ణ, బి.బాలరాజు, కె.వెంకటేశ్వర రావు, జాస్తి రవిశంకర్‌లతోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పొన్నూరు: మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన నిధులను స్వాహా చేసిన గ్రేడ్- 3 పంచాయతీ కార్యదర్శి డి. వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగ సాయికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ములకుదురు గ్రామానికి సంబంధించి రూ. 76,963, మాచవరం రూ. 5,97,509, చింతలపూడి రూ.3,66,909 కలుపుకుని మొత్తం రూ. 10,41,381ను వెంకటేశ్వరరావు పంచాయతీలకు జమ చేయలేదు. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డెప్యూటీ మండల పరిషత్ అధికారిని ఆదేశించారు. రెవెన్యూ రికవరీ చట్టప్రకారం వసూలు చేసి, పంచాయతీలకు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి అందులో పేర్కొన్నారు.

60 గజాల స్థలంలో నిర్మాణాలకు సడలింపులు

- జీఓ 114 ద్వారా స్పష్టంచేసిన ప్రభుత్వం
- క్లెసా ఏపీ అధ్యక్షులు కె.కమలాకరరెడ్డి వెల్లడి



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్, పట్టణాభివృద్ధి రంగాన్ని పారదర్శకంగా, వేగవంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జీఓ నెం.114 ద్వారా ఏపీ బిల్డింగ్ రూల్స్-2017 కీలకమైన సవరణలు తీసుకొచ్చిందని ఏపీ కానఫెడరేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజనీర్లు, సర్వేయర్లు, ఆర్కిటెక్చర్లు (క్లెసా,ఏపీ) అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాక్షికి వివరాలు తెలియచేశారు. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన భవన నియమావళిలో చేసిన సవరణల ప్రకారం 50 చదరపు మీటర్లు (60) గజాల లోపు స్థలాల్లో భవన నిర్మాణానికి సడలింపు ఇచ్చిందన్నారు. ఆ స్థలాల్లో గ్రౌండ్, గ్రౌండ్ ప్లస్ వన్ ఫ్లోర్ భవన నిర్మాణానికి పూర్తి ఫీజుల మినహాయింపు ఇస్తూ కేవలం రూ.1టోకెన్ ఫీజుతో ఆన్‌లైన్స్‌లో దరఖాస్తు చేసుకోనే అవకాసం ఇచ్చిందన్నారు. కంప్లీషన్, ఆకుపెన్సీ సర్టిఫికేట్ అవసరం లేకుండా చేసిందన్నారు. మూడు మీటర్ల లోపు సెట్‌బాక్ ఉన్న ప్రదేశాల్లో టీడీఆర్ వినియోగాన్ని అనుమతించిందన్నారు. పాత పట్టణాలకు ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. అపార్ట్‌మెంట్లు, మాల్స్, హోటల్స్, ప్రభుత్వ భవనాల్లో సీసీటీవీ, ఎల్‌ఓటీ, డీటీహెచ్, కేబుల్ టీవీ వంటి వసతులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని, వాటిలో 90 రోజుల ఫుటేజ్ స్టోరేజ్ తప్పనిసరిగా ఉండాలని సూచించిందన్నారు. 300 నుంచి 500 చదరపు మీటర్ల స్థలాల్లో సెల్లార్‌కు అనుమతించిందని, నిర్మాణ సమయంలో పక్క భవనాలకు హానీ కలగకుండా స్ట్రక్చరల్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసిందన్నారు. భూమిని విరాళంగా ఇచ్చినవారికి ఆర్‌డీబీ ప్రకారం టీడీఆర్ ద్వారా ప్రోత్సాహం ఇచ్చిందని, అయితే తొమ్మిది మీటర్ల కంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్లకు టీడీఆర్ వర్తించదని పేర్కొన్నారు. యుఎల్‌బీ, యూడీఏ లెవెల్‌లో గడువు మూడేళ్ల వరకు మాత్రమే ఉండేలా సవరణలు చేస్తూ పదిశాతం బిల్డ్‌అప్ ఏరియాను రిజిష్టర్డ్ మార్టగేజ్ డీడ్ ద్వారా మున్సిపాలిటీకి హాండోవర్ చేయాల్సి ఉంటుందని అన్నారు. నిర్మాణ భద్రత కోసం ఇండెమ్నిటీ బాండ్, స్ట్రక్చరల్ సర్టిఫికెట్ తప్పనిసరి చేసిందన్నారు. గత కొన్నిరోజులుగా క్లెసా తరఫున సమర్పించిన సూత్రాలు, ప్రజాభిప్రాయాలను పరిగణలతో ఈ మార్పుల రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తాము భావిస్తున్నామన్నారు. ఈ జీవో అమలుతో భవన అనుమతుల ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని, చిన్న గృహ నిర్మాణాలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యం కలుగుతుందని అన్నారు.

అట్రాసిటీ కేసు పూర్వాపరాల పరిశీలన




బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్లలో గల ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నిమిత్తం సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు శుక్రవారం పరిశీలనకు వచ్చారు. గ్రామానికి చెందిన నాగమ్మ డ్వాక్రా గ్రూపు సభ్యులు అదే గ్రామానికి చెందిన యానిమేటర్ ఎస్‌కె మస్తాన్‌వలిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీని నిమిత్తం సత్తెనపల్లి డీఎస్పీ ఇనిమెట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చేరుకుని నాగమ్మ డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారించారు. గ్రూపుకు సంబంధించిన డబ్బులను యానిమేటర్ మస్తాన్‌వలి తమకు సంబంధం లేకుండా కాజేశాడని, ఆ డబ్బుల గురించి అడుగగా మమ్మలను కులం పేరుతో ధూషించాడని చెప్పారు. నోటికొచ్చినట్లు తిట్టడమే గాక మీరు తక్కువ జాతివారు, మాదిగ కులం పేరెత్తి తిట్టాడని డీఎస్పీకి డ్వాక్రా సభ్యులు వివరించారు. వెంటనే స్పందించిన డీఎస్పీ మీరు చెప్పిన వివరాల ప్రకారం మస్తాన్‌వలిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కూచిపూడి రమేష్, నందిగం మరియదాసు, గోవిందు ముత్తయ్య, నాగేశ్వర రావు, నాగమ్మ డ్వాక్రా గ్రూపు లీగర్ నందూరి కుమారి, గోవిందు వీరమ్మ, గుజ్జర్ల ముసలమ్మ, తాళ్లూరి వెంకాయమ్మ, మందా సంతోషమ్మ, తదితరులు ఉన్నారు.

కమిటీ సభ్యుల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ(అత్యాచార నిరోధక)చట్టం, పారిశుద్ధ్య పనివారల నిషేధం, పునరావాస చట్టం కింద జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ(అనధికార)లో సభ్యుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ యు. చెన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సామాజిక స్పృహ, అవగాహన కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు అర్హులని పేర్కొన్నారు. కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, సంబంధిత ధ్రువపత్రాలతో (రెండు సెట్ల ఫొటోస్టాట్ కాపీలు) జూలై 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని ఆయన సూచించారు.

గుండెపోటుతో వలస కార్మికుడి మృతి



రాంబాబు (ఫైల్)

నర్సంపేట రూరల్: గుండెపోటుతో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఓ లాడ్జిలో శుక్రవారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన చలవాది రాంబాబు (44) నర్సంపేటకు 20 రోజుల కిందట వలస వచ్చాడు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో బిర్యానీ మాస్టర్‌గా పని చేస్తూ లాడ్జిలోని ఓ గదిలో ఉంటున్నాడు. గురువారం రాత్రి హోటల్‌లో పని ముగించుకుని లాడ్జికి చేరుకున్న రాంబాబు శుక్రవారం ఉదయం పనికి వెళ్లకపోవడంతో హోటల్ సిబ్బంది వచ్చి చూడగా అచేతనంగా పడి ఉన్నాడు. లాడ్జి నిర్వాహకుల సమాచారంతో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్ లక్ష్మి

చీరాల రూరల్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సమరోతు లక్ష్మి, ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన లక్ష్మి, గుంటూరు జిల్లా తాడికొండలో డిగ్రీ చదువుతోంది. రాష్ట్ర జట్టు తరఫున కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది.